27న సైన్స్ ఎక్స్‌పోజర్ సందర్శన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ నెల 27న సైన్స్ ఎక్స్ పోజర్ సందర్శనకు ఒడిశాలోని రాయఘడ పరిసర ప్రాంతాల్లోని 6 ప్రాంతాలను విద్యార్థులు సందర్శించనున్నారు. ఈ మేరకు సైన్స్ ఎక్స్ పోజర్ విజిట్ గోడ పత్రికను కలెక్టర్ శనివారం ఆవిష్కరించారు. రాయఘడ పరిసర ప్రాంతాల్లో గల మినరల్ వాటర్ ప్లాంట్ అండ్ బేవరేజ్ లిమిటెడ్, జెకె పేపర్ మిల్స్, నాగావళి ప్లానిటోరియం అండ్ సైన్స్ మ్యూజియం, ఫిమాకేమ్ లైం స్టోన్ ఇండస్ట్రీ, ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో అల్లోయ్ లిమిటెడ్, పారంపాత్ పార్క్ సందర్శన కోసం జిల్లా నుంచి 130 విద్యార్థులతో పాటు 30 మంది ఉపాధ్యాయులు వెళ్లనున్నారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా సైన్స్వోర్ అధికారి జి.లక్ష్మణ్, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులెప్పుడో?

- మార్పులు, చేర్పుల కోసం ఎదురుచూపులు
- అర్హులైన లబ్ధిదారులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని 23 పంచాయతీల్లో సుమారు 342 గ్రాములు ఉండగా 14,182 రేషన్ కార్డులు ఉన్నాయి. 28 రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా పేదలకు రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. రేషన్ కార్డులో పేర్లను సులభంగా తొలగిస్తున్నా అదే స్థాయిలో పేర్ల చేర్పును చేపట్టకపోవడంతో పుట్టింటి నుంచి మెట్టింటికి వెళ్లిన కొత్త కోడళ్లకు రేషన్ దక్కని పరిస్థితి ఎదురవుతోంది. వివాహమై ఇంటి పేరు మారినా రేషన్ కార్డులో మాత్రం పేరు నమోదు కావడం లేదు. ఇలా మండలంలో వేలాది మంది కొత్త కోడళ్ల పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నా అధికారులు సరైన సమాచారం ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై మూడేళ్లుగా దరఖాస్తులు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. పేర్ల తొలగింపు ప్రక్రియ మాత్రం నిరంతరంగా కొనసాగుతోంది. నమోదుకు ఆన్లైన్లో ఆప్షన్ ప్రభుత్వం లాక్ చేయడంతో సమస్య ఏర్పడుతుంది.

పేరుకుపోతున్న దరఖాస్తులు

పెళ్లి కాగానే కార్డుల నుంచి పేర్లు తొలగుతాయని కొందరు యువతులు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. అత్తారింటి కార్డులో పేరు చేర్చే అప్షన్ లేకపోవడంతో కొందరు తొలగింపునకు అంగీకరించడం లేదు. సదరు కార్డులు అలాగే కొనసాగుతుండగా పలు గ్రామాల్లో పేర్లు తొలగించాలని తహశీల్దార్లకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ మేరకు విచారణ చేసి తొలగిస్తున్నారు. మూడేళ్ల వ్యవధిలో రేషన్ కార్డులో ఒక్క పేరు కూడా చేర్చలేదని అధికారులే చెబుతున్నారు. మూడేళ్లలో పేరు నమోదుకు నిరీక్షిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. కొత్తగా పెళ్లి, వేరు కాపురం ఉంటున్న వారు కొత్తకార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల సంఖ్య కూడా భారీగానే ఉంది.

> 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది మండలంలోని రేషన్ కార్డుదారుల పరిస్థితి. రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడంతో రేషన్ బియ్యం అందక లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా రేషన్ కార్డుల్లో ఇతర కుటుంబ సభ్యుల పేర్లను చేర్చకపోవడంతో తిప్పలు ఎదురవుతున్నాయి. ఒక వైపు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడం, మరో వైపు పాత రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు చేయకపోవడంతో అర్హులైన లబ్దిదారులు నిరాశకు గురవుతున్నారు.

తొలగింపులు సులువే

ఐదేళ్లలో మరణించిన వారి పేర్లు ఇంకా కొనసాగుతుండడంతో యూనిట్ల సంఖ్య అలాగే ఉండడం వల్ల రేషన్ పక్కదారి పడుతోంది. కొత్తగా పెళ్లి అయినవారు, మృతి చెందిన వారి విషయాలను గ్రహించిన ప్రభుత్వం ఇటీవల ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. కొత్తగా పెళ్లయిన వారు, మృతి చెందిన వారి వివరాలు సేకరించి తొలగిస్తున్నారు. పెళ్లి అయిన వెంటనే పేరు తొలగింపునకు స్థానికంగా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత అధికారి విచారణ చేసి తహశీల్దారు లాగిన్‌కు పంపిస్తారు. పేరు తొలగించినట్లు తహశీల్దారు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం తీసుకొని డిఎస్ఒ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. విచారణ చేసి పేరు చేరుస్తారు. దీనికి ఆర్డీవో కార్యాలయం నుంచి ప్రత్యేక అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కూడా అత్తారింటికి ఉన్న కార్డులో మాత్రమే పేరు చేరుతుంది. కొత్తగా పెళ్లైన జంటకు మాత్రం కార్డు జారీ అయ్యే అవకాశం లేదు.

కొత్త రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నాం

రేషన్ కార్డుతోనే అన్ని పథకాలకు ముడిపడి ఉండడంతో కొత్త రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నాం. మాది ఒడిశాలోని రాయగడ నుంచి కురుపాం బతుకు తెరువు కోసం కుటుంబంతో వచ్చాం. ఐదేళ్లుగా కురుపాంలో నివాసం ఉంటూ మెకానిక్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాను. ఆధార్ కార్డు కూడా మార్చించుకున్నాను. ఒడిశాలో రేషన్ కార్డులో ఉన్న పేరును తొలగిస్తే ఆంధ్రాలో రేషన్ కార్డు మంజూరవుతాదని అధికారులు అంటే అక్కడ పేరు తొలగించి సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. కానీ నేటికీ మంజూరు కాలేదు.

అలక రాజు,
కురుపాం.

అర్హులకు తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలి

గత ప్రభుత్వ హయంలో నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు కొత్త కార్డుల కోసం లబ్ధిదారులు ఎదురు చూసి విసిగి చెందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా నేటికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడం దారుణం. తక్షణమే ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్ కార్డులు, చేర్పులు, మార్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

కోలక అవినాష్,
సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు.

ప్రభుత్వ నుండి ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం

ప్రభుత్వం నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు, మార్పులు, చేర్పులు గూర్చి ఇంతవరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డులు మంజూరు, చేర్పులు, మార్పులకు విధి విధానాలు లబ్ధిదారులకు తెలియజేసి చర్యలు చేపడతాం.

ఎం. రవణమ్మ
తహశీల్దార్ కురుపాం.

ప్రజాచైతన్యయాత్రలో భాగంగా సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న అప్పారావు

ఎలిఫెంట్ జోన్ పెట్టొద్దు

సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఎలిఫెంట్ జోన్ పెట్టొదన్న సిపిఎం ఆధ్వర్యాన ప్రజా చైతన్యయాత్రలో భాగంగా శనివారం ర్యాలీ చేపట్టింది. మండలంలోని అప్పయ్యపేటలో సిపిఎం నాయకులు బొరపరెడ్డి అప్పారావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మండలంలో గల అమ్మాదేవి కొండ వద్ద ఏనుగుల జోన్ పెట్టొద్దని, చుట్టు పక్కల గల గ్రామ ప్రజల ప్రాణాలకు, మండల ప్రజల ప్రాణాలకు ముప్పు తేవొద్దని, ఇప్పటివరకు ఉపాధి పనులు చేసిన వేతనదారులకు బకాయి ఉన్న ఏడు వారాల బిల్లులు చెల్లించాలని, అందరికీ 200 రోజులు పని దినాలు కల్పించి రోజు వేతనం రూ.600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 24న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అప్పయ్యపేటలో ప్రారంభమైన ర్యాలీ జోగింపేట, గుచ్చిమి, తాన్న సీతారాంపురం, చిన్నారాయుడిపేట, మరిపివలస మీదుగా పులుగుమ్మి, గడబవలస, రేపటి వలస, తామరకండి, చిన భోగిలి వరకు సాగింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ నాయకులు రెడ్డి వేణు, మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, సిహెచ్ కృష్ణ, వై.రాంబాబు, గిరిబాబు, పాడి సింహాచలం, రాయగడ తవుడన్న దొర, శ్రీధర్, ఎన్. వాసు తదితరులు పాల్గొన్నారు.

కొంకడివరంలో ఫారంపాండ్‌ను గునపాంతో తవ్వి ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వాన నీటిని ఒడిసిపడదాం : కలెక్టర్

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ఉపాధి హామీ చట్టం కింద ఫారం పాండ్లను నిర్మించి, వాన నీటిని ఒడిసిపడదామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రైతులకు పిలుపు నిచ్చారు. తద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకొని, అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకునే సౌలభ్యం కలుగుతుందని అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని కొంకడివరంలో సామూహిక ఫారం పాండ్స్ పనులు డ్వామా ఆధ్వర్యంలో శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని గుణపం పట్టి మట్టిని తవ్వి ఫారం పాండ్ల పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచినీటి విలువపై అవగాహన, మంచినీటి వనరులను తెలివిగా ఉపయోగించు కునేలా పిలుపు నిచ్చేందుకు ప్రతి ఏటా మార్చి 22న ప్రపంచ జల దినోత్సవంను జరుపు కుంటున్న సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. ప్రాణాధారమైన జలాలను ఒడిసి పట్టుకోకుంటే భవిష్యత్తులో నీటి కష్టాలు తప్పవని, వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టాలను పెంచుకోవడం మానవాళికి చాలా అవసరమని తెలిపారు. జలనిధిలో ప్రజా భాగస్వామ్యం పెరిగేలా గ్రామాల్లోని ప్రజలను, రైతులను అధికారులు చైతన్యపరుస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మాణాలు చేపడితే వ్యర్థ జలాలు రహదారులపైకి రాకుండా ఇంకుడు గుంతల్లోకి చేరి భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. రైతులు పొలాల్లో నీటి కుంటలు, ఫారం ఫాండ్స్ నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఇప్పటికే ఫారం పాండ్ల పనులు ప్రారంభించిన రైతు అల్లు తిరుపతినాయుడును కలెక్టర్ దుస్సాలువతో ఘనంగా సత్కరించారు.

ఆయిల్ పామ్ సాగుకు రైతులు కషి చేయాలి

జిల్లాలో ఆయిల్ పామ్ (పామాయిల్ పంట) సాగుకు రైతులు కృషి చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. కొంకడివరంలో ఉపాధి హామీ చట్టంకింద ఆయిల్ ఫామ్స్, మినీ గోకులాలను కలెక్టర్ పరిశీంచారు. ఈ సందర్భంగా కొంకడివరం గ్రామ సర్పంచ్ ఆయిల్ పామ్ సాగు చేయడంపై కలెక్టర్ ఆయన్ను అభినందించారు. కేవలం వరి పంట మాత్రమే కాకుండా పామాలిన్, జీడి పెంపకంతో కూడా అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని తెలిపారు. అనంతరం అదే గ్రామంలో నిర్మితమైన గోకులాలను కలెక్టర్ పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, తహశీల్దార్ పి.బాల, ఎంపిడిఒ జి.పైడితల్లి, సర్పంచ్ అల్లు అప్పల నాయుడు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఊరిబడిని రక్షించుకుందాం నిరసన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాపమ్మవలస గ్రామస్తులు, యుటిఎఫ్ నాయకులు

ఊరి బడిని రక్షించుకుందాం : యుటిఎఫ్

25న నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీనాన్ని వ్యతిరేకిస్తూ "ఊరి బడిని రక్షించుకుందాం" అన్న నినాదంతో ఈనెల 25న మంగళవారం పార్వతీపురం పట్టణంలోని డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు యుటిఎఫ్ చేపడుతున్న నిరసన ర్యాలీలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, విద్యాభిలాషులు, యువత పాల్గొని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు కోరారు. మండలంలోని విలీన సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాల్లో ఒకటైన పాపమ్మవలసలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5, తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం, యుపి పాఠశాలలను రద్దు చేయడం వంటి చర్యలకు నిరసనగా నిరసన ర్యాలీ చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులంతా పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీతానగరం యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పల్లె శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

విడివికెల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు : ఎపిడి

ప్రజాశక్తి - సాలూరురూరల్

విడివికెల ద్వారా గిరిజనుల నుంచి జీడీ పిక్కలను కొనుగోలు చేస్తామని వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల విడివికె సభ్యులకు నాణ్యమైన జీడిపిక్కల కొనుగోలుపై మెళకువలు, రికార్డుల నిర్వహణ అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి పంట సీజన్ ప్రారంభమైందని, జీడిపిక్కల నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేసేలా విడివికె సభ్యులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జీడిపిక్కల్లో ఎ-గ్రేడ్ పిక్కలు ముందుగా జీడి రైతుల వద్ద సభ్యులు కొనుగోలు చేయాలని, ఈ విషయంలో సభ్యులంతా బాధ్యతగా వ్యవహారించాలని తెలిపారు. రైతులకు మంచి మద్దతు ధర వచ్చేలా వారికి జీడిపిక్కల నాణ్యత గురించి వివరించి మార్కెట్ ధర కంటే అధిక ధర వచ్చేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎంలు ఎ.జయమ్మ, ఇ.జయ కుమార్, శివున్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

అధికారుల్లేని సమావేశాలెందుకు?

ప్రజాశక్తి - సీతానగరం

మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు హాజరు కావాల్సి ఉన్నా ఎందుకు హాజరు కావడంలేదని, అధికారుల్లేని సమావేశాలు ఎందుకని పలువురు సభ్యులు ప్రశ్నించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.రమణమ్మ అధ్యక్షన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు మాట్లాడుతూ మూడు నెలలుగా విద్యుత్, ఆర్అండ్‌బి, అటవీశాఖ, పిఆర్ ప్రాజెక్టు అధికారులు సమావేశాలకు హాజరు కావడంలేదన్నారు. దీంతో సమస్యలు పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలకు గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదించాలని ఏకవాచ తీర్మానం చేశారు. లక్ష్మీపురం, అప్పయ్యపేట ఎంపిటిసి సభ్యులు టి.పార్వతి, పి.కుసుమ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు తక్షణమే బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. జగనన్న కాలనీకి రోడ్డు నిర్మించాలనిపెదభోగిలి ఎంపిటిసి సభ్యులు ఎస్.గౌరి కోరారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, ఎఒ ఎస్.అవినాష్, ఎపిఎం శ్రీరాములునాయుడు, పలువురు ధికారులు, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కోరారు. ఈనెల 24న ప్రపంచ క్షయ (టిబి) నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో శనివారం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సర్వే చేసి క్షయ వ్యాధి లక్షణాలున్న వారిని వైద్య సిబ్బంది గుర్తించాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో టిబి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడా మందులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ప్రతి నెలా వెయ్యి రూపాయలు చొప్పున ఆరు నెలలు వారి ఖాతాలో జమ అవుతాయన్నారు. మందులు క్రమం తప్పకుండా వేసుకునేలా సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. లయన్స్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రెడ్ క్రాస్, వర్తక సంఘాలు, ప్రభుత్వ అధికారులు నిక్షయ్ మిత్రగా చేరి భాగస్వాములవుతున్నారని, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, టిబి రహిత జిల్లాగా తీర్చు దిద్దేందుకు సహరించాలని కోరారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ క్షయ ఒక అంటువ్యాధి అని, రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్షయ క్రిములు గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, కఫం, జ్వరం ఉండటం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, ఉమ్మిలో రక్తం పడడం మొదలకు లక్షణాల ద్వారా గుర్తించవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, జిల్లా క్షయ నియత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, టిబి ల్యాబ్ సూపర్వైజర్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో మానవహారం చేపట్టిన వైద్య సిబ్బంది

క్షయవ్యాధి నివారణ పై ర్యాలీ

సాలూరు : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రి నుంచి బోసుబొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. పొగ, మందు తాగే వారికి క్షయవ్యాధి ఎక్కువగా సంక్రమిస్తుందని చెప్పారు. పోషకాహారం తీసుకోకపోవడం వల్ల, సుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి టిబి వస్తుందని చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారు సమీపంలో ఉన్న ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, టిబి యూనిట్ సూపర్ వైజర్ నరేష్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లకు 25 వరకు గడువు పెంపు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో బీసీ వర్గాల స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్. గడ్డెమ్మ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ గడువు 22వ తేదీతో ముగిసిందని, అయితే మరో మూడు రోజులు గడువును ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ఈ అవకాశాన్ని బిసి, ఇబిసి అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అర్హులైన అభ్యర్థులు సచివాలయంలో గాని లేదా ఏదైనా ఇంటర్నెట్ సెంటర్లో గానీ, రేషన్ కార్డ్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రము, ఆదాయ ధ్రువీకరణ పత్రము, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఈ నెల 25లోగా https://apobmms.apcfss.in వెబ్ సైట్‌లో ఆన్లైన్లో దరఖాస్తులను సమర్పించాలని ఆమె సూచించారు.

రీసర్వేల్లో తప్పులు.. రెవెన్యూకు కాసులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



బహుశా వారి భాషలో సంపద సృష్టించుకోవమంటే ఇదేనేమో..! తప్పులు చేసిందీ వారే, ప్రజలకు తిప్పలు పెట్టించిందీవారే. చివరికి కాసుల వర్షం కురిపించుకుంటున్నదీ వారే. ప్రభుత్వం ఇక్కడ ప్రేక్షక పాత్ర పోషించడంతో భూ యజమానుల ఆవేదనలు, ఆక్రందనలు అన్నీ ఇన్నీ కావు. తాత తండ్రుల నాటి భూములు, కష్టపడి సంపాదించుకున్న భూములు రక్షించుకోవానికి రెవెన్యూ కార్యాయాల చుట్టూ తిరుగుతున్నవారు కొందరైతే, ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగాలే తిరిగి తిరిగి జుమాయించుకుపోయినవారు మరికొందరు. మొత్తానికి ఆ భూముల వివరాలు ఆన్‌లైన్ పేరిట 2014 -19 మధ్య అప్పటి టిడిపి ప్రభుత్వం చేపట్టిన వెబ్ ల్యాండ్ మొదలుకుని 2019 తరువాత నిర్వహించిన జగనన్న భూ సురక్ష - శాశ్వత భూహక్కు పేరిట సర్వే, తాజాగా కూటమి ప్రభుత్వం దానికి కొనసాగింపుగా చేస్తున్న రీసర్వే అన్నీ ఒక్కటే. ముఖ్యంగా గత ప్రభుత్వం, నేటి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలు సరాసరి ఒక్కటే. కాకపోతే, గతంలో పాతిన సరిహద్దు రాళ్లపై అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డి తన పేరు రాయించుకోవడంతోపాటు ఫోటో ముద్ర కూడా వేయించుకున్నారు. నేటి ప్రభుత్వం ఆ పేర్లను, ఫొటోలను చెరిపివేసే కార్యక్రమం చేపట్టింది. కాస్త అటు ఇటుగా ఉన్నా నాటి రాతలు, ముద్రలు, ప్రస్తుతం వాటి చెరిపివేతకు చేసిన, చేస్తున్న ఖర్చు మాత్రం రూ.కోట్లలోనే. ఇదంతా ప్రజాధనమే. ఈ సంగతి కాస్త అటుంచితే, నాటి టిడిపి ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ స్వల్ప సమయంలో వెబ్‌ల్యాండ్ పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులు, సిబ్బంది మెడపై కత్తిపెట్టింది. ఈ ఒత్తిడి నుంచి బయటపడేందుకు విఆర్ఒ స్థాయిలో రెవెన్యూ సహాయకులు లేదా గ్రామంలోని బాగా తెలిసిన వ్యక్తులను పక్కన బెటటుకొని ఇష్టారాజ్యంగా, తప్పుల తడకగా నమోదు చేశారు. దీంతో, ఒకరి భూమి ఒకరికి, సెంటు భూమి లేనివారికి పదులు, వందల ఎకరాలు ఉన్నట్లు, తాతతండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములు సెంటు భూమి లేనట్టు నమోదయ్యాయి. మారిన పరిస్థితులను బట్టి కనీసం బ్యాంకులో వ్యవసాయ రుణం పొందాలన్నా పూర్వకాలంలో ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకం కన్నా ఆన్‌లైన్‌లోవున్న 1బిలకే విలువ ఎక్కువైంది. దీంతో, ముఖ్యంగా రైతులు వ్యవసాయ రుణాలు పొందలేని పరిస్థితి. భూ క్రయ, విక్రయాలకు తీవ్రమైన ఆటంకం ఏర్పడింది. ఏకంగా రిజిస్ట్రేషన్లే నిలిచిపోయే పరిస్థితి. వాటిని సరిచేయాలంటే తిరిగి విఆర్ఒ మొదలుకుని ఆర్ఐ, తహశీల్దార్ సంతకాలతో కూడిన అప్రూవల్ చేయాలి. పొరపాటు, తప్పులు సహజం. ఈ మాటకొస్తే ప్రతి తప్పును లేదా పొరపాట్లను సరిచేసుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. ఇందుకు అనుగుణంగా వెబ్‌ల్యాండ్‌లో దొర్లిన తప్పుల సరిచేసే అవకాశం, బాధ్యత కూడా ప్రభుత్వం కల్పించింది. కానీ, ఇక్కడ తప్పులు, పొరపాట్లుచేసిన విఆర్ఒ లేదా ఇతర సిబ్బంది, అధికారులే వాటిని మరింత జఠిలం చేసి మరీ భూ యజమానుల్ని ముప్పు తిప్పలు పెడుతున్నారు. మ్యుటేషన్ పెట్టాలంటే డబ్బు, వాటిని అప్రూవల్ చేయాలంటే డబ్బులు, మధ్యలో ఆఫైల్ ఆన్‌లైన్‌లో కదలాలంటే డబ్బు ఇవ్వాల్సిందే. ఇలా రోజులు, నెలలు, ఏళ్లు గడిచినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో జనం డబ్బులు ఇవ్వడానికి కూడా అలవాటుపడిపోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇది చాలదన్నట్టు గత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న సమగ్ర భూ రక్ష పేరిట రీసర్వే చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 984 రెవెన్యూ గ్రామాలు ఉండగా, వీటిలో 502 గ్రామాల్లో రీసర్వే చేపట్టింది. వీటిలో సుమారు 100 గ్రామాల్లో సర్వే అసంపూర్తిగా ఉంది. ఇందులో మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. అన్నదమ్ములకు ఉమ్మడి ల్యాండ్ పార్శిల్ మెంబర్లను ఇచ్చేశారు. ఫలితంగా ఆన్‌లైన్‌లో 1బి లు రావడం లేదు. వీటిని విడదీయాలంటే ఆర్‌డిఒ లేదా జెసి లాగిన్ వరకు వెళాల్సివుంటుంది. ఇందుకోసం రూ.550 ప్రభుత్వానికి చలానా తీయాలి. ఎన్ని ఎల్‌పిఎం విడదీయాలంటే అన్ని రూ.550 చొప్పున ఇవ్వాల్సిందే. అనధికారంగా వేలాది రూపాయలు దండు కుంటున్నారు. సరిహద్దు సమస్యలు ముందుకు వచ్చాయి. విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉత్పన్న మయ్యాయి. గ్రామాల్లో లేనివారి పేర్లు కూడా రికార్డుల్లోకి వచ్చాయి. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామంటూ గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించి, ఫిర్యాదులు స్వీకరించినప్పటికీ అందులో చిత్తశుద్ధి నేతి బీరకాయలో నెయ్యి చందంగానే ఉంటోంది. ఇది చాలదన్నట్టు కూటమి ప్రభుత్వం కూడా జగనన్న మాదిరిగానే రీసర్వే చేపట్టింది. 27 గ్రామాలకు గాను ఇప్పటి వరకు 21 గ్రామాల్లో తొలిదశ సర్వే పూర్తచేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈనెల 15 నుంచి మలిదశ సర్వే మొదలు పెట్టారు. ఇందులో గతంలో సర్వేచేసిన గ్రామాలను పక్కనబెట్టామని అధికారులు చెబుతున్నారు. మరి ఆ సమస్యలను ఎవరు పరిష్కరిస్తారు? కొత్తగా చేపట్టిన సర్వే కూడా పాత సీసాలో కొత్తసారా మాదిరిగానే ఉంది. దీంతో, ప్రజలు తమ భూములు కాపాడుకోవాలంటే రెవెన్యూ సిబ్బంది, అధికారుల చేతులు తడిపాల్సిందే అంటూ పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.

ఓ వైపు విచారణ..మరోవైపు బెదిరింపులు

ప్రజాశక్తి - కొమరాడ

ఒకవైపు విచారణ చేస్తున్న నేపథ్యంలో అధికారులు, మరి కొంతమంది ఉద్యోగులు రంగ ప్రవేశం చేసి బెదిరిస్తూ అప్పుడు అవినీతికి పాల్పడిన వ్యక్తి మంచి వ్యక్తి అంటూ పత్రికల్లో రాయించుకునే పరిస్థితి ఉందని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో వెలుగు ఎపిడి పై సత్యంనాయుడు పనిచేసిన కాలంలో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధులపై ఒకవైపు దర్యాప్తు చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఇంకోవైపు ఎపిడి పైన గతంలో ఫిర్యాదులు చేసిన వారి వద్దకు వెలుగులో పనిచేసిన డిపిఎం, ఎపిఎం, సీసీలు కొంతమంది వెళ్లి భయభ్రాంతులకు చేసి మంచి వ్యక్తి అని సంతకాలు చేయించుకోవడం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఒక వైపు విచారణ జరుగుతున్న వ్యక్తి గురించి సిబ్బంది, అధికారులు ఫిర్యాదు దారులను బెదిరించి సంతకాలు చేయించుకోవడమేంటని ప్రశ్నించారు. వెలుగులో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధులు పక్కదారి పట్టాయని, ఆ నిధులు సక్రమంగా వినియోగించకపోవడంలో ఎపిడి సత్యంనాయుడు పాత్ర ఉందని దీనిపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ నిధులను రికవరీ చేయలని కోరారు.

17 వరకు రేషన్ డీలర్‌పై చర్యలొద్దు
హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ఒకటో వార్డులో వున్న రేషన్ డీలర్ పురమా లలితపై ఏప్రిల్ 17 వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశిస్తూ రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కోర్టు ఉత్తర్వులు సివిల్ సప్లయ్ జిల్లా అధికారులు, మండల అధికారులకు అందాయి. శ్రీ సాయి మహిళా పొదుపు సంఘం అధ్యక్షులు పురమా లలితపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మండల సివిల్ సప్లయ్ అధికారులు ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీంతో రేషన్ డీలర్ పురమా లలిత హైకోర్టుని ఆశ్రయించడంతో తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలా వుండగా రేషన్ డీలర్ పురమా లలితపై రాజకీయ వేధింపులలో భాగంగా కొంతమంది తప్పుడు ఫిర్యాదులు చేయడంతో అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలుస్తోంది.

పోలీసుల ఆధ్వర్యంలో 26 నుంచి క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠపురం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ధర్మలక్ష్మిపురం మైదానం వద్ద ఈనెల 26నుంచి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ కారక్రమాన్ని పాలకొండ డిఎస్‌పి రాంబాబు ప్రారంభిస్తారన్నారు. క్రికెట్ టోర్నీలో పాల్గొవాలని ఆసక్తి కలిగిన యువకులు 8074949913 , 8639061889 నెంబర్లకు ఫోన్ చేసి టీం పేరు, ఊరుపేరు ఈ రోజు నుంచి ఈనెల 25లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, టోర్నీలో గెలుపొందిన వారికి మొదట బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందజేస్తామన్నారు.

జోరుగా చేతిపంపుల మరమ్మతులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

బోరును బాగు చేస్తున్న సిబ్బంది

గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు గత 20 రోజులుగా క్రాష్ ప్రోగ్రాం ద్వారా విస్తృతంగా చేతిపంపుల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి ఎంపిడిఒ జి.రమణమూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 575 చేతిపంపులకు గానూ ఇప్పటివరకు 20 పంచాయితీల్లో గల 120 చేతిపంపులకు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలిగినా తక్షణమే సమీప పంచాయతీ కార్యాలయంలో తెలియజేస్తే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించి తాగునీరందించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బోర్ మెకానిక్‌లు శ్రీను, బాబ్జీ, రాజేష్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించండి

ప్రజాశక్తి - పాలకొండ

ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం అన్నారు. శనివారం సిబ్బందితో కలిసి పన్నులు వసూలు చేసేందుకు పర్యటించారు. ఇంటి కొళాయి, ఖాళీ స్థలాల పన్నులు కూడా ఈ నెలాఖరులో చెల్లించాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ దాటితే అదనపు వడ్డీతో చెల్లించాల్సి వస్తుందని ఈ విషయాన్ని ప్రజలంతా గ్రహించాలని అన్నారు.

గ్రామాల్లో నవోదయం 2.0

ప్రజాశక్తి- సీతానగరం

గరుగుబిల్లి మండలంలోని సన్యాసిరాజుపేట, కొంకిడివరం గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ సిఐ పద్మావతి ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటుసారా తాగడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. నాటుసారా ప్రభావం ఉన్న కొంకిడివరం, ఎస్సార్ పేట, ఉల్లిభద్ర, లక్నాపురం గ్రామాలను అధికారులు దత్తత తీసుకున్నారని ఈ గ్రామాలలో నాటుసారా అమ్మకాలు నిర్మూలన ధ్యేయంగా రెవెన్యూ , పోలీసుల సహకారంతో నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది, పంచాయతీ సెక్రటరి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు .

చెట్ల నీడే దిక్కు..

ప్రజాశక్తి - వీరఘట్టం


చెట్టు నీడన సేదతీరుతున్న కూలీలు

ఉపాధి హామీ పనులు చేసే చోట కనీసం నీడ సౌకర్యం కూడా లేకపోవడంతో కూలీలంతా చెట్ల నీడనే తలదాచుకుని పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు రోజురోజుకే అధికంగా ఉండటం వల్ల వేతనదారులు ఎండ తీవ్రతకు బలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వేతన దారులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు పనులు జరిగిన చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని, స్థానికులు కోరుతున్నారు

నేరాలు ఘోరాలు

1200 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గోర గిరిజన గ్రామ సమీపంలో ఎస్సై జి.కళాధర్ ఆధ్వర్యంలో శనివారం సారా తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించగా, 1200 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎక్కడైనా సారా తయారుచేసినా, విక్రయాలు జరిపినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

సీతంపేట : మండలంలోని కుసిమిగూడ కొండపై 3వేల లీటర్లు బెల్లం ఊటలను నేలమట్టం చేసినట్లు ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. సారా రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం సాయిబాబా గుడి దగ్గర శనివారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇరువురు గాయాలయ్యాయి. ఎల్ఎన్‌పురం నుండి బొబ్బిలి ద్విచక్ర వాహనంపై వెళుతున్న వాసిరెడ్డి శంకర్రావుకు ఎదురుగా బైక్ పై వస్తున్న కుశల్ కుమార్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.

అవగాహనతో కేంద్రాలను నడపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంగన్వాడీ కేంద్రాలు నూతన విద్యా విధానం ప్రకారం మారనున్నాయని శిక్షణలో చెప్పిన విషయాలపై అవగాహన చేసుకుని కేంద్రాలను సక్రమంగా నడపాలని పార్వతీపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. చిన్నారులకు సరైన పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు ప్రాథమిక విద్యను కూడా నేర్పే కేంద్రాలుగా అంగన్వాడీలను సెంటర్లను తీర్చిదిద్దడమే పోషణ్ బి పడాయి బి అనే పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. మూడు రోజులుగా పార్వతీపురం నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో శిశువులకు ప్రాథమిక విద్య మాతృభాషలో బోధించే విధంగా దృశ్య శ్రవణ విధానంలో జరిగే ఈ మూడు రోజుల శిక్షణ తరగతులను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు రమాదేవి, రామలక్ష్మి, బంగారమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు మేధాశక్తి ప్రేరణకు కార్యకర్తలు కృషి చేయాలని సిడిపిఒ కె.విజయగౌరి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ- బీ, పడాయి బీపై రెండు రోజులుగా

కురుపాం: మాట్లాడుతున్న సిడిపిఒ విజయగౌరి

జరుగుతున్న శిక్షణ శనివారం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. 0-3 సంవత్సరాల్లోపు పిల్లలకు మేధాశక్తి ప్రేరణ కల్పించడం, 3 -6 సంవత్సరాలోపు పిల్లలకు ఆట పాటలతో, పిల్లలను అభివృద్ధి చేయడంపై ఇచ్చిన శిక్షణను అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేసి పిల్లలను అభివృద్ధి పరచాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు భవాని, జానకి, గౌరి, శ్రావణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: అంగన్వాడీ కార్యకర్తలకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ బి పడాయి బి శిక్షణ ఎంతో మేలు జరుగుతుందని ఎంపిడిఒ కే గీతాంజలి, సిడిపిఒ పి రంగలక్ష్మి అన్నారు. స్థానిక కేజీబీవీలో మూడు రోజులు పాటు అంగన్వాడి కార్యకర్తలకు ఇచ్చిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ బి పడాయి బి శిక్షణ పొంది గ్రామాల్లో తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సూపర్వైజర్లు మిస్సమ్మ, గౌరీ, బేగం, లావణ్య, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమంపై అవగాహన అవసరమని సిడిపిఒ జి సుగుణ కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులు పాటు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం ముగిసింది. ప్రతి చిన్నారికి ప్రతిరోజూ కనీసం రెండు గంటల ఆట-పాటలతో కూడిన ప్రీ-స్కూల్ బోధన అందిస్తారని చెప్పారు. బాల్య సంరక్షణ, విద్యపై దృష్టి సారిస్తారని భవిష్యత్తుకు ఒక మంచి పునాది వేయడానికి సహాయపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సూపర్వైజర్లు శారదంబ, అరుణ, లక్ష్మి, మండలంలోని ఉన్న అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోషణ బి - పడాయ్ బి శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్వాడి కేంద్రాల్లో అమలు చేయాలని సూపర్వైజర్లు జె.జ్ఞానమ్మ, ఎన్ రాజేశ్వరి కార్యకర్తలకు సూచించారు.

నేడు విద్యుత్తు అంతరాయం

మక్కువ: మండలంలోని మావుడి సబ్‌స్టేషన్ పరిధిలోని మక్కువ, సాలూరు మండలాల ప్రజలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డిఇఇ కె.గోపాలరావు నాయుడు తెలిపారు. 33/11 ఎస్ఎస్ మావుడి పరిధిలో సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు జరుగుతున్నందున ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. అలాగే 3ఫేస్ ఉదయం 4గంటల నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇవ్వనున్నామని తెలిపారు. ప్రజలంతా గమనించాలని ఆయన తెలిపారు.

జాతర ఆదాయం రూ.23 లక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని కొరాపుట్ జిల్లా, బంధుగాం బ్లాకు, నీలావతిలో ఈనెల 17,18, తేదీలలో జరిగిన అగ్గి గంగమ్మ జాతర సందర్భంగా భక్తుల విరాళాలు కమిటీ సభ్యుల సమక్షంలో శనివారం లెక్కించారు. అమ్మవారికి రూ.22, 69,869లు ఆదాయం వచ్చినట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ బడే సత్యనారాయణ తెలిపారు. మూడు గ్రాముల బంగారంతో పాటు ఒక కేజీ వెండి కానుకగా భక్తుల అమ్మవారికి సమర్పించారని చెప్పారు. ఖర్చులు పోను మిగతా ఆదాయాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసి ఆలయాభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.

సభ్యులకు నేడు పరీక్ష

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్ ప్రోగ్రాంలో భాగంగా రాత్రి సమయంలో విద్య నేర్చుకున్న సంఘ సభ్యులకు అంచనా అర్హత కోసం ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెలుగు ఎపిఎం సురేష్ బాబు అన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ ఎం. మల్లికార్జునరావు చేతుల మీదుగా పరీక్ష పత్రాలను వెలుగు ఎపిఎం సురేష్ బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎపిఎం సురేష్ బాబు మాట్లాడుతూ వెలుగు కార్యాలయంలో ఈ పరీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 31 గ్రామపంచాయతీల్లో విద్య నేర్చుకున్న సంఘాలకు 66 సెంటర్లలో పరీక్ష ఉంటుందన్నారు. మండలంలో మొత్తం 1342 అభ్యాసకులు పరీక్షకు హాజరవుతారన్నారు. అనంతరం పరీక్ష పేపర్లను ఆయా గ్రామాల విఒఎలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిసిలు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: అక్షరాస్యత (ఉల్లాస్) అర్హత పరీక్ష ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసామని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు అన్నారు. శనివారం 'ఉల్లాస్ కార్యక్రమంలో' భాగంగా నిర్వహించనున్న అర్హత పరీక్షకు అవసరమైన మెటీరియలను మండల వెలుగు కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన వెలుగు విఒఎకు ఎపిఒఎ శ్రీరాములతో కలిసి ఆయన

సాలూరు: పరీక్షా పత్రాలను అందిస్తున్న అధికారులు

పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: చదువు లేకుండా ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉల్లాస్ పథకంను ప్రవేశ పెట్టి వయోజనలకు విద్యను అందిస్తుందని, దీని నిమిత్తం ఆదివారం పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో అక్షరాస్యత పరీక్షా సంబంధిన మెటీరియల్‌ను ఆమె వెలుగు ఎపిఎం అంపాల్లి జయమ్మతో కలిసి విఒఎలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదట విడతగా 1740 మంది నిరక్షరాస్యులను ఎంపిక చేసి ఈ పరీక్ష పెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, విఒఎలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గోతులను పూడ్చండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పట్టణ పరిసర ప్రాంతాల్లో గల రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కాంగ్రెస్ ఒబిసి మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, జిల్లా నాయకులు కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు, మాజీ కౌన్సిలర్ బొమ్మాలి మోహనరావు, మండల నాయకులు మామిడి చంద్రకుమార్ తదితరులు పట్టణ పరిసర ప్రాంతంలోని రోడ్లలో ఏర్పడిన గోతులను శనివారం పరిశీలించారు. స్థానిక పాత బస్టాండ్, రాయగడ రోడ్డులోని డంపింగ్ యార్డ్, ఆర్టీవో కార్యాలయం, ఫ్లైఓవర్, మెయిన్ రోడ్, బైపాస్ రోడ్, వైకాయం కాలనీ నుంచి వెంకంపేటకు వెళ్లే రోడ్డు, అడ్డాపుశీల తదితర ప్రాంతాల రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో రోడ్లన్నీ పెద్ద పెద్ద గోతులమయ్యాయని, వాటిని ఎన్నికల హామీగా చూపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్రాంతిలోగా పూడ్చుతామంటూ ప్రకటనలు గుప్పించిందన్నారు. ఈ రోడ్డులో ప్రయాణం ఇబ్బందికరంగా ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఆయా రోడ్లలో ఏర్పడిన గోతులను పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని కోరారు.

ధర్నాను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 29న ఐటిడిఎ వద్ద గిరిజన సమస్యలపై నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు వి.ఇందిర, గిరిజన సంఘం నాయకులు మధు పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించిన గోడ పత్రికలు కూనేరు సంతలో గిరిజన సంఘ ఆధ్వర్యంలో శనివారం విడుదల చేశారు. అనంతరం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన్యం జిల్లాలో ఐటిడిఎ పరిధిలో 8 మండలాల్లో గిరిజనులు సుమారు 68వేల ఎకరాల జీడి పంట సాగు చేస్తున్నారన్నారు. గిరిజన రైతులకు దళారుల నుండి రక్షణ కల్పించే విధంగా వారి పండించే జీడి పంటతో పాటు ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజనలు పండించిన జీడి పంట 80 కేజీల జీడి పిక్కల బస్తాలు 16 వేల రూపాయలకు కొనుగోలు చేయాలని ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కొనుగోలు చేయాలని అన్ని గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం మంచినీటి సౌకర్యం రహదారి సౌకర్యాలు కల్పించాలని నీటి సమస్య పరిష్కారం

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఇందిరా, తదితరులు

చేయాలని కోరారు. గిరిజనలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, నిరుపేదలకు ఇల్లు స్థలంతో పాటు ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనుల ఉన్నతి చదువు కోసం పీజీ కాలేజ్ ఏర్పాటు చేయాలని, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని 100 పడకల హాస్పిటల్ పూర్తి చేయాలని, మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థుల చదువుకు దూరం చేసే విధంగా మోడల్ స్కూల్‌ని నిలుపుదల చేయాలని కోరారు. వీటిపై చేపట్టనున్న ధర్నాలో గిరిజన ప్రజానీకం అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన రైతులు యువకులు పాల్గొన్నారు.

కురుపాం : గిరిజన జీడి రైతులకు దళారుల నుంచి ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం యువత అనిల్, వాసు, ఇండియా డిమాండ్ చేశారు. మండలంలోని మొండెంఖల్‌లో ఈనెల 29న ఐటిడిఎ కార్యాలయం వద్ద గిరిజన సమస్యలపై చేపట్టబోయే ధర్నా గోడపత్రికలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, సాలూరు, సీతంపేట మండలాల్లో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి మిగతా అటవీ ఫలసాయాలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు. అన్ని గిరిజన గ్రామాలకు రహదారి, విద్య, మౌలిక వసతులు కల్పించి, గిరిజనులు సాగు చేస్తున్న సాగు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. 3,4,5 తరగతుల విద్యార్థులకు చదువుకు దూరం చేసేలా ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న మోడల్ స్కూల్ విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన యువత పాల్గొన్నారు.

కడకెల్లలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల సచివాలయ పరిధి కడకెల్లలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌కు శంకుస్థాపన

వీరఘట్టం: మండలంలోని కంబర, ఎం.రాజపురం గ్రామాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసేందుకు శనివారం ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తి నాయుడు, తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ ఎన్ పాండురంగ భూమి పూజ చేశారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ చట్టం ద్వారా నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యనాయుడు, జి.గౌరునాయుడు, టెక్నికల్, ఫీల్డ్ సహాయకులు పాల్గొన్నారు.

ఆధునీకరణ పనులకు చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి కాలువల ఆధునీకరణ పనులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తోటపల్లి ఆధునీకరణ పనులకు 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పనులకు శంకుస్థాపన చేశారని, అయితే వెంటనే అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పనులను పూర్తిగా గాలికి వదిలేసిందని ఆరోపించారు. 25శాతం పనులు పూర్తికాకపోవడంతో దీన్ని రద్దు చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఇరిగేషన్ శాఖమంత్రి నిమ్మల రామానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి పనులు ప్రారంభానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ విషయమై రైతులంతా గుర్తిస్తున్నారని, ప్రతిపక్షం ఈ విషయాన్ని వేరేలా ప్రజలను మభ్యపెట్టడం సరికాదని అన్నారు. అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రస్తావిస్తుంటే ప్రతిపక్ష నాయకులు దీన్ని వక్రీకరించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తోటపల్లి ఆధునీకరణ పనులు తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు.

అటవీ హక్కుల చట్టంపై శిక్షణ

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో చిన్నబగ్గ పంచాయితీ, సంకిలి గ్రామంలో అటవీ హక్కుల చట్టం 2006పై ఎఫ్ఆర్‌సి సభ్యులకు హేటేట్, రికార్డ్స్ ఆఫ్ రైట్స్‌పై వెలుగు ఆధ్వర్యంలో శనివారం శిక్షణ నిర్వహించారు. ఇందులో ముందుగా ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించి దాని ప్రాముఖ్యత గురుంచి తెలియజేశారు. నీటి వనరులు తరుగుదలకు కారణాలు, నీరు కలుషితానికి గల కారణాలు గురంచి వివరించారు. అనంతరం అడవుల పెంపకం, నీరుని వడిచి పట్టే పనులు చేపట్టడం గురించి, ప్రకృతి వ్యవసాయం చేయడం గురించి, రసాయినాల వాడకం తగ్గించాలని, ప్లాస్టిక్ వాడకం మానేయాలని, నెలకి ఒకసారి గ్రామం చుట్టూ ప్లాస్టిక్ ఏరి కాల్చేయాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అడవికి - ఆది వాసులకు ఉన్న సంభంధం గురించి, అటవీ హక్కుల చట్టం-2006 ముఖ్య ఉద్దేశం, చట్టం ద్వారా సంక్రమించే వ్యక్తిగత హక్కులు, ఉమ్మడి హక్కులు, అటవీ సంరక్షణ హక్కులు గురించి వివరించారు. ఈ హక్కులు పొందటానికి అటవీ హక్కుల కమిటీలు సక్రంగా పనిచేయాలని సూచించారు. కమిటీ విధులు భాద్యతలు వివరించారు. ఈ శిక్షలో 45 మంది సభ్యులు పాల్గొనగారిసోర్సు పర్సన్సుగా ఎ.చిరంజీవి రావు, ఎ.నాగరాజు, యస్.పార్వతి, ఉమాలావణ్య, మజ్జయ్య పాల్గొన్నారు.

జీవామృతం.. దిగుబడులకు మూలం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులకు జీవామృతమే మూలమని జీవ ప్రాజెక్ట్ కోఆరినేటర్ జి. ప్రబోధ్ అన్నారు. మండలంలోని రాయగడ జమ్మూ పంచాయతీ పరిధిలో పెంగవ గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం, జీవ ప్రాజెక్టు సంయుక్తంగా జట్టు సంస్థ పర్యవేక్షణలో అమలు చేస్తున్న మా తోట ప్రాంగణంలో టైప్ టు ఘనజీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. భూమిని సారవంతం చేసుకోవడానికి ఘనజీవామృతం ఈ వేసవిలో తయారు చేసి నిల్వ ఉంచుకుంటే ఖరీఫ్ కాలంలో తొలకరి జల్లులకు ముందు ప్రారంభ దశలో అవసరమైన అన్ని రకాల పంటలకు వేసుకోవడానికి సిద్ధం అన్నారు. ఈ జీవామృతాలు వేసుకోవడం వల్ల భూమి సారవంతం చెందుతుందని, పంట దిగుబడిలో సూక్ష్మ, స్థూల పోషకాలు లభిస్తాయని అన్నారు. భూమిలో నిక్షిప్తంగా దాగి ఉన్న రైతు మిత్రులైన వానపాములకు, మిగతా సూక్ష్మజీవులకు

జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

ఉత్తేజం కలిగించి జీవన క్రియలకు ఆస్కారం కలుగుతుందని అన్నారు. ప్రతి రైతు జీవామృతం తయారు చేసుకునేలా కార్యకర్తలు దగ్గరగా ఉండి ప్రణాళికలు తయారు చేసి ఆచరించే విధంగా పాటుపడాలన్నారు. రైతు సేవా కేంద్రంలోని సబ్సిడీపై లభించే వ్యవసాయ పరికరాలను సద్వినిగంచే సుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ జి.మురళీ మోహన్, మోడల్ మేకర్ ఆర్. రామారావు, ఎల్‌వన్ పి. జగదీష్, ఎల్‌టు టి. మన్మథ రావు, కే చిరంజీవి, ఎల్‌త్రి పి. దివాకర్, ఎం. సురేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

ప్రజాశక్తి- సీతంపేట

అధికారులకు సమస్యను వివరిస్తున్న సర్పంచ్

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఫోన్లో అధికారులతో మాట్లాడారు. వాటర్ డే సందర్భంగా మండలంలో దారపాడు పంచాయతీ కోసంగి, రామనగరం, గొలుకుప్ప గూడ గ్రామస్థులు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు నీటి ఎద్దిడి అధికంగా ఉందని చరవాణిలో గ్రామస్తులు సర్పంచ్ జిలకర సుందరమ్మ తెలిపారు. దీంతో ఎమ్మెల్యే స్థానిక నాయకులను, అధికారులను అప్రమత్తం చేశారు. ఆగ్రామాల్లో పది రోజుల్లో సంపూర్ణంగా తాగునీరందించేలా కృష ఇచేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక సచివాలయం సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గిరీషా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సత్యంతో పాటు ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, హిమరక ప్రసాద్, సోమునాయుడు, సుబ్బారావు, మన్మథ ఆయా గ్రామాలను సందర్శించి సమస్యను పరిశీలించారు.

ప్రహరీ నిర్మాణం నాణ్యతగా ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

జాతీయ ఉపాధిహామి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రహరి గోడలు నిర్మాణాలు నాణ్యతతో, వేగవతంగా చేయాలని పాలకొండ డివిజన్ పంచాయతీరాజ్ ఈఈ జి.రవి అన్నారు. శనివారం కురుపాంలో నిర్మిస్తున్న ప్రహరి గోడ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 40 ప్రహరి గోడలు మంజూరు అయ్యావని వీటిలో ప్రస్తుతం 10 ప్లహరి గోడలు నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. పనులను నాణ్యతతో వేగవంతంగా చేపట్టాలని జెఇ పి.నాగేశ్వరరావుకు, ఉపాధిహామి సిబ్బందికి సూచించారు.

శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- సీతంపేట

ఎస్‌డబ్ల్యూపిసిపై ఇచ్చిన శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ డిఎల్‌పిఒ రాంప్రసాద్ అన్నారు. సీతంపేట పంచాయతీ ఎస్‌డబ్ల్యుపిసి వద్ద మండలంలో క్లాప్ మిత్రులకు, గ్రీన్ గార్డులకు, పంచాయతీ కార్యదర్శులకు ఘనపదార్థాల నిర్వహణపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుండి చెత్తను ఏ విధంగా గ్రీన్ అంబాసిడర్స్ సేకరించాలి ఏ విధంగా వేరుచేసి దానిని వర్మీ కంపోస్ట్‌గా మార్చాలి అనే పద్ధతులపై ఆయన పలు సూచనలు చేశారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేసి వర్మ కంపోస్ట్ తయారు చేస్తే పంచాయతీకి లాభాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, సర్పంచ్ ఎ.కళావతి, ఇఒపిఆర్‌డి సత్యం, డిపిఆర్‌సి రిసోర్స్ పర్సన్ కన్నబాబు, పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, పాపారావు, కామేశ్వరరావు, వినోద్, రాజారావు, రాజశేఖర్, శివాజీ, రవి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలం లోని భద్రగిరి గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.వరప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతికి 80 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. 2024 -25 సంవత్సరంలో నాలుగో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు www.aptwreis.aprss. in వెబ్‌సైట్‌లో ఎస్‌టి అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9948944919, 9440348217 నెంబర్లకు సంప్రదించాలని అన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

నాటుసారా నియంత్రణే లక్ష్యం

ప్రజాశక్తి - సీతంపేట

నాటుసారా అమ్మకాలు, తయారీ నియంత్రణే లక్ష్యమని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్ మధుబాబు అన్నారు. మండలంలోని కుసిమిగూడలో రాజాం ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ అధ్వర్యంలో నాటుసారా తయారీ, అమ్మకాలపై అవగాహన కల్పించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా తాగటం వల్ల ఏర్పడే కష్టనష్టాలు, అనారోగ్యాల గురించి వివరించారు. నాటుసారా అమ్మకాలను నిర్వహిస్తూ పట్టుబడిన వారికి చట్ట ప్రకారం ఉన్న శిక్షలు, వాటి తీవ్రత వివరించారు. గ్రామంలో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు ఎవరైనా నాటుసారా అమ్మకాలు నిర్వహిస్తున్నట్లయితే ఎక్సైజ్ శాఖకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. టోల్ ఫ్రీ నెంబర్ 14405కు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సిఐ జైభీమ్ తెలిపారు. అనంతరం సమావేశం వద్ద నవోదయం 2.0 గురించి తెలిపే గోడ పత్రికలు అంటించి, కరపత్రాలను పంచి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుసిమిగూడ సర్పంచ్ ఎస్. కూర్మారావు, సచివాలయం సెక్రటరీ రాజారావు, విఆర్ఒ, మహిళా పోలీస్, పీసా అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.